వీధి తలుపుతీసి వుండటం చూసి, "అమ్మా!" అని పిలుస్తూ హాల్లోకి అడుగుపెట్టిన జ్యోతి మూసివున్న గది తలుపు చూసి, "ఓహో! అయ్యగారు దయచేసి నట్టున్నారు." అనుకుంది పళ్ళు నూరు కుంటూ. కూతు రికేకవిని, పెరటి వసారాలో కూర్చుని కళ్లు వత్తుకుంటున్న వర్ధనమ్మ పెరటి గుమ్మంలోంచి తొంగి చూసి, కళ్లతోనే కూతుర్ని రమ్మన్నట్టు సైగచేసింది. జ్యోతి దగ్గరకి వెళుతూ,

"మళ్లీ యేమైనా గొడవా? ఎప్పుడొచ్చాడు అనడిగింది తల్లి వాలకం చూసి.

"పొద్దున్న! నువ్వు ఆఫీసుకి వెళ్లాక! ఎవరో పిల్లని వెంటపెట్టుకు మరీ వచ్చాడు" అంది. అలా అంటుంటే ఆవిడ కళ్లలో నీళ్లు జలజలా రాలాయి!

"ఎవరో పిల్లనా?" అంది తెల్లబోతూ జ్యోతి.

"గుళ్లో పెళ్లిచేసుకున్నాడుట!" ఆవిడకి యేడుపు ఆగటంలేదు. ఆ మాట వినగానే,

"అయ్యో రామా! ఇదొకటా?" అంటూ కాళ్లల్లో శక్తి లేనట్టు తల్లివక్కనే కూలబడిపోయింది జ్యోతి!

"ఇంతకాలం యెంత ఆగడం చేసినా డబ్బుకోసం తిండికోసం చేశాడు అని ఎలాగో భరించాను. ఇంక నా వల్లకాదే తల్లీ!" అంటూ వెక్కివెక్కి యేడుస్తున్న తల్లిని జ్యోతి నిస్సహాయంగా చూస్తూ వుండిపోయింది. రమణ యింటికి వచ్చిన్నాడూ, వెళ్లిన్నాడూ, నిజానికి యింట్లో వున్నంతకాలం ఈ యేడుపులు, గొడవలు, అల్లర్లు తప్పవు. ఇంటికి పెద్దకొడుకుగా, జ్యోతికి అన్నగా, తల్లికి అండగా రమణ యెప్పుడూ నిలబడలేదు. ఎవరి పొరపాటో తెలియదుగాని బాగా చిన్నవయసు లోనే రమణ చెడు స్నేహాలకి లోనై పూర్తిగా పాడైపోయా డు. చదువు బొత్తిగా అబ్బలేదు. పైగా వయసు వస్తున్న కొద్దీ మొండితనం, మొరటుతనం, పొగరు బాగా అలవ డ్డాయి. తండ్రి బ్రతికివున్నంతకాలం రమణని సరిదిద్ద డానికి అనేక ప్రయత్నాలు చేసి, విసుగెత్తి నిరాశతో వదిలేశాడు. ఆయన పోయాక రమణ ఆగడాలకి అసలు హద్దూ, అపూ లేకుండా పోయింది. చదువులేదు. పని లేదు. అలగా వాళ్లతో పూరమ్మట తిరగడం, ఆకలేసి నప్పుడూ, మరోదారి లేనప్పుడు యింటికి రావడం. తల్లిగాని చెల్లెలుగాని నోరెత్తితే మొదట్లో తిట్లూ, తర్వాత, తర్వాత చెయ్యిగూడా చేసుకోవడం బాగా అలవాటైంది రమణకి! రమణ నోరు తెరిచాడంటే మర్యాదస్తులైన వాళ్లెవరూ తలెత్తలేరు. అందుకే అయిన వాళ్లుగానీ, యిరుగుపొరుగులు గాని, తల్లీ కూతుళ్ల మీద యెంత జాలివున్నా వాళ్ల విషయాల్లో కలుగజేసుకోవడం మానే శారు. కంచంలోకి తిండి యెలా వస్తోంది అన్న ఆలోచనే లేదు రమణకి! కంచం ముందు కూర్చున్నాడంటే, తను కోరుకున్నవన్నీ యధావిధిగా వుండాల్సిందే! లేకపోతే కంచం తల్లి మీదకి విసిరి కొడతాడు. తల్లి, చెల్లెళ్ల తలకొట్టి అయినా సరే తనకి కావలసిన డబ్బులు తీసుకు పోవడానికి వెనుకాడడు. గుడ్డిలో మెల్లయేమి టంటే ఒకసారి యిల్లు వదిలిపోయాడంటే వారం పదిరోజులు తిరిగి రాడు. ఎక్కడికి పోతాడో, యేంచేస్తాడో యెవరికీ తెలీదు. ఇంట్లో యేం అల్లరి చేసినా తన అలగా స్నేహితుల్ని మాత్రం యింటికి తీసుకురాడు. ఇంటికేకాదు. ఆ వీధి వైపే రానివ్వడు. అందువల్లే ఆ తల్లీకూతుళ్లు కొంతవరకూ ఆ వీధిలో మర్యాదగా బ్రతక గలుగుతున్నారు.

తండ్రి అనారోగ్యం, పేదరికం, అన్న రౌడీ తనాల మధ్య నలిగిపోతూనే జ్యోతి స్కూలు చదువు పూర్తి చేసి, వాళ్లకాళ్లూ, వీళ్లకాళ్లూ పట్టుకొని చిన్న వుద్యోగం సంపాదించుకుంది. చిన్నదైనా యిల్లు స్వంతం కావ డంవల్ల, తల్లికి వచ్చే పెన్షన్ డబ్బుతో వాళ్లు ముగ్గురూ హాయిగా బ్రతికేయవచ్చు. కానీ రమణ ఆగడాలు రోజు




రోజుకి యెక్కువ అయిపోయి తల్లీకూతుళ్లకి మనశ్శాంతి లేకుండా పోతోంది. ఇంతకాలం రమణ చేసిన రగడ ఒక యెత్తూ, ఈసారి యీ పిల్లని యెవరినో పెళ్లి చేసుకున్నానంటూ వెంటపెట్టుకు రావడం మరొక యెత్తూ!

వాడిపోయిన మొహంతో అప్పుడే ఆఫీసునించి వచ్చి బట్టలన్నా మార్చుకోకుండా వెర్రిమొహం వేసుకు కూర్చున్న జ్యోతిని చూసి వర్ధనమ్మ మనసు వేడి తగిలిన వెన్నలా కరిగిపోయింది. క్షణంలో తనని తనే సంబాళించుకుని కళ్లు తుడుచుకుంటూ,

"ఇది రోజూ వుండే యేడుపే! వాడిని కన్న నాటినుండీ నాకు కన్నీళ్లు తప్ప యేం మిగిలాయి గాని, పద! కాఫీ కలుపుతాను. తాగుదువుగాని!" అంటూ లేచి నిలబడింది. ఆవిడకి తెలుసు, యెంత యేడిచినా అది తీరే సమస్యకాదనీ, ఆ యింట్లో 'రమణ' అన్న సమస్యకి పరిష్కారం లేదనీ! రమణ యింటికి వచ్చిన్నా డు వున్న ఒక్క గదీ ఆక్రమించేస్తాడు. పైగా ఈసారి ఆ పిల్లతో సహా గదిలో దూరి కూర్చోవడంతో జ్యోతికి మరీ కంపరంగా వుంది. జ్యోతి బట్టలన్నీ గదిలో వుండి పోవడంతో, యేంచెయ్యాలో తోచనట్టు పెరటి గుమ్మంలోనే కూర్చుండిపోయింది.

"అమ్మా! కాఫీపెట్టు! ఇవాళ్టినుంచీ నా వంతు రెండు కప్పులు!" అని అరుస్తూ, ఆవలించుకుంటూ పెరటి వైపు వచ్చిన అన్నని అసహ్యంగా చూసి, జ్యోతి తల తిప్పుకుంది. అలాంటి చూపుల్ని లక్ష్యపెట్టే మనిషైతే రమణ అలా వుండనే వుండడు. నలిగిపోయిన పైజమా, మాసిపోయివున్న బనీను, తాగుడు నిద్రలేమితో యెర్ర బడ్డ కళ్లు. కరుకుదనం మూర్తీభవించి వున్న మొహం! ఆ పిల్ల యేంచూసి వీడితో వచ్చిందో అనుకుంది జ్యోతి! రమణ మొహం కడుక్కుని గదిలోకి వచ్చేలోపల తనబట్టలు వంటింట్లోకి తెచ్చేసుకుంటే, ఈ ఆఫీసు బట్టలైనా మార్చుకుని కాస్త తెరిపిన పడవచ్చు అను కుంటూ గబగబ గదిలోకి వెళ్లబోయిన జ్యోతి తన మంచం మీద అస్తవ్యస్తంగా పడుకుని వున్న మనిషిని చూసి, అవాక్కయిపోయి, జుగుప్సతో మనసంతా ముడు చుకుపోగా, వంటింట్లో తల్లి దగ్గరకి పరిగెత్తుకుంటూ వచ్చేసింది. గదిలో వున్నది పిల్లా.... పీచూకాదు .. పక్కా బజారు మనిషి! తల్లి పొద్దున్న సరిగ్గా చూసి వుండదు. ఆ మాటే తల్లితో చెప్పేసరికి, ఆవిడ,

"రామ! రామ! ఎలాంటి వంశంలో యెలాంటి అప్రాచ్యుడు పుట్టాడే! ఈ పీడ యింక ఈ యింట్లోనే గామోసు! నా నెత్తిన యెలాంటి రాత రాశాడో ఆ భగవంతుడు." అంటూ నెత్తి కొట్టుకుంది. ఇంక ఆమని షి పర్మనెంట్‌గా ఈ యింట్లోనే అన్నమాట తల్లి జ్ఞాపకం చెయ్యగానే జ్యోతి గుండెలు గుభేలుమన్నాయి. ఆ మనిషి ఈయింట్లో వుంటే తామెలా వుండడం? ఉండక యెక్కడికి పోతారూ? అంటే ఆ మనిషితో పాటు సహ జీవనం సాగించాలన్నమాట! తనకి కొంతవరకూ ఫరవా



లేదు. ఆఫీసుకైనా పోయి కాస్త వూపిరి పీల్చు కుంటుంది. కాని పాపం తల్లి మాటేమిటి? ఆ మనిషికి చేసిపెడుతూ, కొడుకుచేత తిట్లూ, తన్నులూ తింటూ యెలా బ్రతకగలదు? జ్యోతికి యిరుగ్గా వున్న గదిలోకి తోసేసినట్టూ, వూపిరి ఆడనట్టూ వుక్కిరి బిక్కిరిగా వుంది. ఇంతలో రమణ,

"అమ్మా! కాఫీ అయిందా?" అంటూ వంటింట్లోకి వచ్చి,

"ఏయ్! జ్యోతీ డబ్బులు కావాలి!" అన్నాడు. జ్యోతి మొహం తిప్పుకుని,

"డబ్బులేం యిక్కడ చెట్లకి కాయడంలేదు." అంది. అదేదో పెద్ద జోక్ అయినట్టు పెద్దగా నవ్వుతూ,

"డబ్బులు చెట్లకి కాస్తే నిన్నెవడు అడుగుతాడు. నేనే వెళ్లికోసుకు తెచ్చుకుందును." అంటూ తల్లి గ్లాసుల్లో పోసిపెట్టిన కాఫీ పట్టుకుని గదివైపు నడిచాడు. రమణ యింట్లో వున్నంత సేపూ తల్లీ కూతుళ్లకి ముళ్లమీద వున్నట్టు వుంటుంది. ఇప్పుడు రమణకి తోడు మరో మనిషి గూడా వుండటంతో మరీ చికాగ్గా వుంది. రమణ యిచ్చిన కాఫీ తాగి, ఆ మనిషి లేచి బాత్ రూమ్‌లోకి వెళ్లడం, మొహం కడుక్కుని మళ్లీ గదిలోకి పోవడం వంటింట్లోనించి యిద్దరూ కళ్లప్పగించి చూస్తూ కూర్చున్నారు. ఆ మనిషి గదిలోకి వెళ్లిన కాస్సేపటికి,

"ఏయ్ జ్యోతీ, బీరువా తాళాలియ్యి!" అంటూ రమణ వచ్చాడు. జ్యోతి తనని కాదన్నట్టు సమాధానం చెప్పకుండా కూర్చుంది. వర్ధనమ్మ మాత్రం,

"బీరువాలో యేం వుందిరా? బీరువాలో దాచుకు నేటంత డబ్బు యింట్లో నువ్వెప్పుడుండనిచ్చావు గనక?" అంది. రమణతల్లి మాట వినిపించుకోకుండా,

"ఏయ్! అడుగుతుంటే నిన్నుకాదూ? బీరువా తాళాలి లాయియ్యి!" అంటూ అడుగు ముందుకి వేశాడు. జ్యోతి హేండ్ బాగ్‌ని చేత్తో గట్టిగా పట్టుకుని,

"అమ్మ చెప్పిందిగా బీరువాలో యేంలేదని!" అంది.

"బీరువాలో యేంవుందో నాకు తెలుసుగానీ, యిస్తావా? యివ్వవా?" అంటూ జ్యోతికి దగ్గరగా వచ్చి హేండ్ బేగ్ లాక్కోబోయాడు.

"దరిద్రుడా! ఆడపిల్ల సొమ్ము తింటున్నానన్న సిగ్గైనా లేదురా?" అంటూ అడ్డువచ్చిన వర్ధనమ్మని చేత్తో విసురుగా వక్కకి తోసి,

"ఆడపిల్లసొమ్మా? నేనేం వూరికే తీసుకోలేదు. ఈ యిల్లునాది! ఈ యింట్లో వుండ నిచ్చినందుకు అదినాకు డబ్బు యిస్తోంది." అంటూ జ్యోతిచేతిలో హేండ్ బేగ్ లాక్కుని తాళాలతోపాటు బేగ్‌లో వున్న యాభైరూపాయల నోటు గూడా జేబులో వేసుకుని గదిలోకి చక్కాపోయాడు. రమణతోసిన తోపుకి వర్ధనమ్మ గుమ్మం మీద పడిపోయింది. దెబ్బమోవుగా తగలడంచేత రెండు నిముషాలు తేరుకోలేక పోయింది. జ్యోతి తల్లిని లేపి కూర్చోపెట్టి, గ్లాసుతో మంచి నీళ్లు తెచ్చి తాగించిన కాస్సేపటికి తేరుకుంది. ఆవిడకి తగిలిన దెబ్బకంటే కొడుకు, "ఈ యిల్లు నాది!" అన్న మాట యెక్కువ షాక్ నిచ్చింది. ఇంతదాకా రమణనోటి నించి అలాంటి మాట యెప్పుడూ రాలేదు. ఇప్పుడు అలా అన్నాడంటే మనసులో యేదో వుందన్నమాట! ఈ కొంప గూడా లేకపోతే యెలాగా? వర్ధనమ్మకి కొత్త బెంగ పట్టుకుంది. గది తలుపు తెరిచిన చప్పుడువిని తల్లీకూతుళ్లు ఆలోచనల నించి తేరుకుని అటువైపు చూశారు. జ్యోతి నోట మాట రానట్టు కన్నీళ్లతో,

"అమ్మా! నా.....నా చీర!" అంది. ఆ మనిషి వంటి మీద జ్యోతి ముచ్చటపడి పండక్కి కొనుక్కున్న కొత్త షిఫాన్ చీర! రమణ గూడా ఎర్రగళ్లచొక్కా, తెల్లపేంటుతో 'షోగ్గా తయారయ్యాడు. వర్ధనమ్మ ఆ దోపిడీకి మాటలు రాక, చేష్టలు దక్కి చూస్తూ వుండిపోయింది. ఇంటి నించి బయలుదేరేటప్పుడు, చెప్పి బయలు దేరే అలవాటు రమణకి లేదు కాబట్టి, భీరువా తాళాలు వంటింటి గుమ్మంలోకి విసిరికొట్టి ఆ మనిషితో వీధిలోకి పోయాడు. రమణ గుమ్మం దాటాక యిద్దరి వంట్లోకి ప్రాణం వచ్చినట్టయింది. రాత్రి చీమచిటుక్కు మన్నా రమణ వచ్చి వడ్డాడేమో అని తుళ్లి తుళ్లి పడుతూనే తల్లీ, కూతులిద్దరూ గడిపారు. ఆ మనిషిని తీసుకుని యెక్కడికి పోయాడో రమణ ఆ రాత్రి మరి యింటికి రాలేదు.

* * * * * *

"జ్యోతీ! మిమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు." అంటూ ప్యూన్ వచ్చి చెప్పడంతో, చేస్తున్న పని ఆపి లేచి ఆఫీసరు గదిలోకి నడిచింది జ్యోతి.

"మిస్ జ్యోతీ! ఈయన నిన్ను వెతుక్కుంటూవచ్చారు." అంటూ ఆఫీసరు తన యెదురుగా వున్న పోలీసిన్‌స్పెక్టర్‌ని చూపిస్తూవుంటే,

'ఈ రమణగాడి గురించి కాదుగదా?' అనుకుంటూ అదురుతున్న గుండెలతో, జీవంలేని కళ్లతో ఆయనవైపు యేమిటన్నట్టు చూసింది.

"రమణారావు నీకేమవుతాడమ్మా?" అంటూ యిన్‌స్పెక్టర్ అడగ్గానే,

అనుకున్నట్టే వాడి గురించే అడుగుతున్నాడు. ఇన్నాళ్లూ పోలీసులూ గొడవాలేదు. ఇప్పుడు యిదికూడా మొదలైందన్నమాట! ఏం వెధవ పని చేశాడో? అనుకుంటూ, "అన్నయ్యండీ"! అంది హీనస్వరంతో. ఆయన రమణ నిన్న యెన్నింటికి యిల్లు వదిలేడు, యెవరు కూడా వున్నారూ వగైరా ప్రశ్నలు అడిగిన తరువాత ఆఫీసరుతో,

"ఈవిడ్ని మాకూడా తీసుకెళతాం సార్! శవాన్ని గుర్తు పట్టాల్సి వుంటుంది." అనగానే జ్యోతి మనసులో,

"శవమా? ఎవరిది? తనెందుకు గుర్తుపట్టాలి?" లాంటి ప్రశ్నలు తేలుకొండెల్లా తలెత్తాయి. అ ప్రయత్నంగా ఆ మాటలే పైకి అనేసింది.

"లక్ష్మీ టాకీసు పక్క సందులో మాకో శవం దొరి కిందమ్మా! మర్డర్ కేసు! నువ్వు వచ్చి గుర్తు పట్టి యెవరో చెప్పాలి." అన్నాడు యిన్‌స్పెక్టర్ గుంభనగా.

"మర్డర్‌కేసు! రమణ! తనుగుర్తుపట్టాలి! అంటే ఆ ఆడమనిషిని వీడు........అమ్మో....." అనుకుంటూ స్పృహతప్పి పోతున్న జ్యోతిని ఇన్‌స్పెక్టర్ చటుక్కున పట్టుకున్నాడు. రెండు నిమిషాల తర్వాత తెలివి వచ్చిన జ్యోతి, నిద్రలో నడుస్తున్నట్లుగా ఇన్‌స్పెక్టర్ వెంట నడిచింది.

జీపు దిగి వణుకుతున్న కాళ్లతో ముందుకి వెళ్లి శవాన్ని చూసిన జ్యోతి కళ్లు బైర్లు కమ్మాయి. 'తను వూహించినదేమిటి? తను చూస్తున్నదేమిటి?' అనుకుంటూ శవాన్ని గుడ్లప్పగించి చూస్తూ అలా వుండిపోయింది. ఎర్రగళ్ల చొక్కా నిండా కత్తి పోట్లే. తెల్లపేంటు రక్తంలో తడిసి ఎర్రపేంటు అనిపించేస్తోంది. తెరుచుకున్న కారాకిళ్లీ నోరు! గారపట్టిన పళ్లు భయంకరంగా కనిపిస్తున్నాయి. తెరుచుకుని వున్న కళ్లు రెప్పవాల్చకుండా జ్యోతినే చూస్తున్నాయి. జ్యోతి మరి చూడలేనట్టు రెండు చేతులతో మొహాన్ని కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తూ రోడ్డుపక్కన కూలబడిపోయింది.

"ఈ శవం మీ అన్నయ్య రమణదేనా?" అని అడుగుతున్న ఇన్‌స్పెక్టర్‌కి తలవూపుతో సమాధానం చెప్పింది.

"బొంబాయి రెడ్‌లైట్ ఏరియానించో పిల్లని తప్పించి కూడా తీసుకొచ్చేశాడుట. బొంబాయి దాదాలు వదుల్తారా? వెంటపడి, నిన్న రాత్రి సినిమా చూసివస్తుంటే వీడి పని పట్టేసి, పిల్లని లాక్కుపోయారు." కాపలావున్న కానిస్టేబిల్ యెవరితోనో చెప్తున్నాడు. శవాన్ని చూసిన దగ్గర్నుంచీ తనగుండెల్ని యెగదన్నుకు వస్తున్న దుఃఖాన్ని బెంగనీ చూస్తే జ్యోతికే ఆశ్చర్యంగా వుంది. అన్నపట్ల యేహ్యాభావం తప్ప మరోభావం తన మనసులో లేదే! తొలిసారిగా వాడు తనమీద, తల్లి మీదా చెయ్యి చేసుకున్న నాడే తమమధ్య బంధం, అనుబంధం లాంటిదేమైనా వుంటే, పుటుక్కున తెగిపోయిందే! మరి యెందుకీ దుఃఖం? ఎన్నోయేళ్లుగా రాచపుండులా తమ కుటుంబాన్ని బాధించిన సమస్య తీరిపోయిందని సంతోషించాల్సింది పోయి, ఏడుస్తోందెందుకనీ? సమస్య తీరిపోయిందా? లేదు! లేదు! నిజమైన సమస్య యిప్పుడే మొదలయింది. ఇన్నాళ్లూ యెలాంటివాడైనా, తాగుబోతో, జూదరో, వ్యభిచారో, మగవాడి అండ తమకి వుండేది. రమణకి భయపడో లేక తమకెందుకనో యింతకాలం తనవైపు కన్నెత్తి చూసి, పన్నెత్తి పలకరించే ధైర్యం యెవరికీ వుండేది కాదు. ఆ సెక్యూరిటీ, రక్షణ యిప్పుడు యేదీ? పురుషులకోసం, పురుషులు వేసిన పునాదులమీదే నిలబడ్డ ఈ సమాజంలో తోడేళ్లలాంటి మనుషులమధ్య ఒంటరి ఆడవాళ్లైన తనూ తల్లీ ఎలా బ్రతకాలి? అన్న భయమే జ్యోతి కళ్లలో నీటిని వూరించి, రమణకి అశృతర్పణం అందించేట్టు చేస్తోంది.